సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



పకడ్బందీగా ఓటరు నమోదు
ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు.
- 9లో ▸



గురుకులంలో సమస్యలు
నస్రుల్లాబాద్ మండలంలో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.8 /24.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం పంపిణీకి 27 వరకు గడువు

కామారెడ్డి రూరల్: రేషన్‌షాపుల ద్వారా అందజేస్తున్న ఆగస్టు నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈనెల 27 వరకు కొనసాగుతుందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే సంబంధిత రేషన్ షాపుల్లో బియ్యం తీసుకోవాలని ఆయన సూచించారు.

అధికారబలంతో గొంతు నొక్కలేరు

- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార



బిచ్కుంద(జుక్కల్) : బీఆర్‌ఎస్ నాయకులకు అధికారం చేతిలో ఉందని అహంకార బలంతో ప్రశ్నించే గొంతును నొక్కలేరని బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార అన్నారు. బీజేపీ కార్యకర్తలపై దాడికి నిరసనగా గురువారం బిచ్కుందలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ధర్నా విరమించాలని పోలీసులు కోరడంతో అరుణతార ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల ఎదుట బీఆర్‌ఎస్ గుండాలు బీజేపీ కార్యకర్తలపై దాడిచేసి గాయపర్చితే పోలీసులు ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులే పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి లక్షల్లో జూదం నిర్వహిస్తున్నారని, అక్రమ ఇసుక దందా నడుపుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దగ్గరుండి ఇలా చేయించడం ఎంత వరకు సబబన్నారు. ప్రజల కోసం జైలుకెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ చేసిన దాడికి బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డి, విష్ణు, పండరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్దెల్‌చెరు వైన్స్‌కు రీటెండర్

బిచ్కుంద(జుక్కల్) : పిట్లం మండలంలోని మద్దెల్‌చెరు వైన్స్ కోసం రీటెండర్ వేస్తున్నామని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 28 వరకు వైన్స్ టెండర్ కోసం దరఖాస్తులు తీసుకుంటామని, 29న ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే డ్రా తీస్తామన్నారు. మొదటిసారి టెండర్ పిలిచినప్పుడు దరఖాస్తులు రాకపోవడంతో తిరిగి రీటెండర్‌కు అధికారులు నిర్ణయించారు. మండలాల్లో అన్ని వైన్స్‌లకు టెండర్లు పూర్తయినప్పటికీ మద్దెల్‌చెరులో ఒక్కవైన్స్ మాత్రం మిగిలిపోయింది. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించాలి

కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల, జోనల్ స్థాయి క్రీడలు సెప్టెంబర్ 16వ తేదీ వరకు పూర్తి చేయాలని డీఈవో రాజు ఆదేశించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రసూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, జోనల్ స్థాయి క్రీడల అనంతరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ మొదటి వారంలోగా పూర్తి చేసుకొని రాష్ట్రస్థాయి క్రీడలకు సిద్ధంగా ఉండాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రసూల్ పేర్కొన్నారు.

జిల్లా కోర్టులో తాగునీటి ప్లాంట్ ప్రారంభం



కామారెడ్డి అర్బన్: జిల్లా కోర్టులో తాగునీటి సౌకర్యం తీర్చడానికి సఫల ఆర్గానిక్స్ కంపెనీ నీటి శుద్ధి ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా న్యాయమూర్తి, న్యాయసేవా ప్రాధికార సంస్థ చైర్పర్సన్ ఎస్ఎన్ శ్రీదేవి అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కోర్టులో సఫల ఆర్గానిక్స్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ఆర్‌వో ప్లాంట్‌ను జిల్లా న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, న్యాయమూర్తులు హారిక, టీఎస్‌పీ భార్గవి, కామారెడ్డి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీధర్, పీపీలు రాజగోపాల్‌గౌడ్, నంద రమేష్, దామోదర్ రెడ్డి, సఫల ఆర్గానిక్స్ యజమాని పైడి ఎల్లారెడ్డి తదితరులున్నారు.

సీఎంవో ఫోకస్!



సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గంపై సీఎంవో ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ప్రధాన సమస్యలు ఏమున్నాయనే విషయమై ఇప్పటికే వివిధ వర్గాలతో మాట్లాడి వివరాలు సేకరించింది.

- జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టిన అధికారులు
- తెరపైకి భీమేశ్వర ప్రాజెక్టు నిర్మాణం
- 22వ ప్యాకేజీ పనుల స్థితిగతులపై ఆరా
- ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన
- ఇప్పటికే మెడికల్ కళాశాల మంజూరు
- ఇంజినీరింగ్ కాలేజీ ఆవశ్యకతపైనా చర్చ

సాక్షి, కామారెడ్డి : నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా సాగునీటి సమస్యను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా దశాబ్దాలుగా అందరి నోళ్లల్లో నాని, మరుగున పడిన భీమేశ్వర ప్రాజెక్టు అంశంపై ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 22వ ప్యాకేజీ పనులు ముందుకు సాగకపోవడంపై ఆరా తీసి, దాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలన్న దానిపైనా దృష్టి సారించారు. సీఎంకు సన్నిహితులైన అధికారులు, అంతరంగికులు రెండు మూడు రోజులుగా వివిధ వర్గాల వారితో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులకు తోడు, చేపట్టాల్సిన అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. తాడ్వాయి మండలంలోని సంతాయిపేట మీదుగా ప్రవహించే భీమేశ్వర వాగుపై ప్రాజెక్టు నిర్మించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. అప్పట్లో దివంగత ఎంపీ ఆలె నరేంద్ర భీమేశ్వర ప్రాజెక్టు కోసం పాదయాత్ర కూడా చేశారు. తర్వాత అది మరుగున పడిపోయింది. ఏటా వర్షాకాలంలో భీమేశ్వర వాగు పొంగి ప్రవహిస్తుంటుంది. భీమేశ్వర ప్రాజెక్ట్ నిర్మిస్తే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగునీరందించవచ్చనే అభిప్రాయం ఉంది. అప్పట్లో అధికారులు సాధ్యం కాదని నివేదిక ఇవ్వడంతో పక్కకు వెళ్లిపోయింది. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా దిగువ నుంచి ఎత్తు భాగానికి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తున్న నేపథ్యంలో భీమేశ్వర ప్రాజెక్ట్ కూడా సాధ్యమేనన్న భావనతో రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులు ఇటీవల వివరాలు సేకరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి 21వ ప్యాకేజీ పనులు పూర్తయితేనే 22వ ప్యాకేజీకి నీరందించే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో దీనిపైన దృష్టి సారించనున్నారని తెలుస్తోంది.

త్వరలో నియోజకవర్గ నేతలతో సమావేశం

కామారెడ్డి నుంచి పోటీ చేయడానికి నిర్ణయించుకున్న సీఎం కేసీఆర్ త్వరలోనే నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఎంత మందిని పిలవాలన్నదానిపై క్లారిటీ రావాల్సి ఉంది. మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని ఈనెల 29న రానున్నారు. కేటీఆర్ వచ్చిన తర్వాతే సమావేశం ఉంటుందని భావిస్తున్నారు. పార్టీ ముఖ్యులతో చర్చించిన తర్వాత నియోజకవర్గానికి తక్షణం చేపట్టాల్సిన వాటి గురించి ప్రకటించే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం పోటీ చేస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కామారెడ్డి మీద దృష్టి కేంద్రీకరించింది.

ఫీడ్ బ్యాక్ కోసం..

జిల్లాలో సీఎంకు సన్నిహితులు, వివిధ వర్గాల నుంచి సీఎంవో అధికారులు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. సీఎం కూతురు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత కామారెడ్డికి చెందిన పలువురితో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ను ఫుడ్ కమిషన్ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి కలిసిన సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులపై మాట్లాడారు. సీఎం సన్నిహితులు, ప్రభుత్వంలో కీలక భూమిక పోషిస్తున్న వారు నియోజకవర్గానికి చెందిన వివిధ వర్గాలతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ప్రజల నాడిని పట్టుకునేందుకు పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారన్నదానిపైనే ఎక్కువ ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యాసంస్థల ఏర్పాటు దిశగా..

సీఎం కేసీఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో కామారెడ్డికి మెడికల్ కాలేజీ వస్తుందని హామీ ఇచ్చారు. ఇటీవలే కళాశాల మంజూరుతో పాటు ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. నీట్ ద్వారా విద్యార్థులు అలాట్ కూడా అవుతున్నారు. త్వరలోనే కాలేజీని ప్రారంభించనున్నారు. కాలేజీ భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయి. కామారెడ్డిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు ఉన్నాయి. అలాగే పీవీ నర్సింహారావ్ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో డెయిరీ ఇంజినీరింగ్ కాలేజీ కొనసాగుతోంది. ఇక్కడ పీజీ కోర్సులు ప్రారంభించాల్సి ఉంది. కాగా విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆధీనంలో కావాల్సినంత స్థలం కూడా ఉంది. గతంలో కామారెడ్డిలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ కోసం కసరత్తు జరిగినా, తర్వాత అడుగులు పడలేదు. ఇటీవల పలు జిల్లాలకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కామారెడ్డికి కూడా కళాశాల విషయమై చర్చ జరిగినట్లు సమాచారం. నియోజకవర్గానికి ఇంకా ఏమేం కావాలన్నదానిపై ఆరా తీస్తున్నారు.

కాంగ్రెస్‌లో.. దరఖాస్తుల వెల్లువ!

- కామారెడ్డి నుంచి షబ్బీర్ ఒక్కడే..
- ఎల్లారెడ్డిలో ముగ్గురు, జుక్కల్‌లో నలుగురు..
- బాన్సువాడలో ఎనిమిది మంది దరఖాస్తు
- నేటితో ముగియనున్న గడువు



సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావహులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. దరఖాస్తులకు గడువు నేటితో ముగియనుండడంతో ఇప్పటికే ముఖ్య నేతలంతా దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి షబ్బీర్ అలీ ఒక్కరే దరఖాస్తు చేసుకున్నారు. ఎల్లారెడ్డి నుంచి ముగ్గురు, జుక్కల్ నుంచి నలుగురు, బాన్సువాడ నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రంతో దరఖాస్తుల కు గడువు ముగియనుంది. ఎల్లారెడ్డి టిక్కెట్ కోసం పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. వీరిద్దరు నియోజకవర్గంలో బలమైన క్యాడర్‌ను కలిగి ఉండి పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇద్దరి మధ్య టిక్కెట్ కోసం తీవ్రపోటీ నెలకొంది. వీరితో పాటు రాజేశ్వర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. జుక్కల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, గడుగు గంగాధర్, లక్ష్మీకాంతరావ్‌తో పాటు సామాజిక కార్యకర్త అయ్యాల సంతోష్ దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారే టిక్కెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. బాన్సువాడలో మాత్రం అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజు, యలమంచిలి శ్రీనివాస్‌రావ్, కూనిపూర్ రాజిరెడ్డి, ప్రతాప్‌సింగ్, మోతీలాల్, వెంకట్రాంరెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం దరఖాస్తులకు శుక్రవారంతో గడువు ముగియనుంది. ఆఖరు రోజు మరికొందరు దరఖాస్తు చేసుకోవచ్చని భావిస్తున్నారు. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి షబ్బీర్‌అలీ బరిలో నిలుస్తున్నారు. సీఎం పోటీ చేసినా, ఎవరు పోటీ చేసినా విజయం తనదేనంటూ కేడర్‌కు చెబుతున్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. ఇక్కడ కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఇద్దరి మధ్య సమన్వయం కుదిరితే అధికార పార్టీకి గట్టిపోటీ ఇవ్వగలుగుతారని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. జుక్కల్ కాంగ్రెస్‌లో పోటాపోటీ నెలకొంది. బాన్సువాడలో స్పీకర్‌ను ఢీకొట్టేది ఎవరన్నదానిపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ టిక్కెట్ కోసం ఎనిమిది మంది దరఖాస్తు చేసుకున్నారు. మరికొన్ని రోజుల్లో ప్రత్యర్థులు ఎవరన్నది తేలిపోనుంది.

కేసీఆర్‌కు ఓటమి తప్పదు

- బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లకే దళితబంధు ఇచ్చారు
- రాష్ట్రంలో బందిపోటు రాజ్యం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ




పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : జిల్లాలో దళితబంధు పథకాన్ని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారికే మంజూరు చేశారని అర్హులైన పేదలకు మాత్రం ఇవ్వలేరని, కామారెడ్డిలో కేసీఆర్‌కు ఓటమి తప్పదని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. గురువారం మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన 80 దళిత కుటుంబాలు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో షబ్బీర్ అలీకి మద్దతు తెలిపాయి. అక్కాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదు కుటుంబాలకు దళితబంధు పథకం మంజూరు చేశారని షబ్బీర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక అక్కాపూర్‌లోనే కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అనుచరులకే దళితబంధు ఇచ్చారని, అందులోనూ 30శాతం కమీషన్ తీసుకుని మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బందిపోటు రాజ్యం నడుస్తోందని, కబ్జాలు,కమీషన్లు, లిక్కర్‌స్కాంలతో రాజ్యమేలుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే దళితుడినే సీఎం గద్దెపై కూర్చోబెడతానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ దళితులను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వంలో హరీశ్ రావు, కేటీఆర్, కవితదే పెత్తనం నడుస్తుందని మంత్రులు, ఎమ్మెల్యేలు డమ్మీలని ఎద్దేవా చేశారు. వచ్చే ఈ ఎన్నికలు కేసీఆర్ కుటుంబం వర్సెస్ కామారెడ్డి ప్రజల మధ్య జరుగుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని కామారెడ్డిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాచారెడ్డి మండల అధ్యక్షుడు గణేశ్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, ఎల్పుగొండ అధ్యక్షుడు మాజహార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులు గల్లంతు..!

- డీఎస్సీపై నిరుద్యోగుల పెదవి విరుపు
- రేషనలైజేషన్‌తో ఖాళీల్లో భారీ కోత
- మిగిలినవి 135 పోస్టులు మాత్రమే..



సాక్షి, కామారెడ్డి : ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించేందుకు సిద్ధమవగా, నిరుద్యోగ ఉపాధ్యాయులు మాత్రం జిల్లాలో పోస్టుల సంఖ్య తెలుసుకుని పెదవి విరుస్తున్నారు. ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను ఖాళీపోస్టులు వెక్కిరిస్తున్నాయి. ఏళ్లుగా ఎదురుచూసినా ఫలితం లేకుండాపోయిందని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

317 జీవో ద్వారా సొంత జిల్లావాసులతో పాటు నిజామాబాద్ నుంచి అదనంగా దాదాపు 500 మంది రావడంతో ఖాళీ పోస్టుల సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది. ఇదే సమయంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రమబద్ధీకరించడం, అలాగే పలు స్కూళ్లు మూతబడడంతో ఉన్న టీచర్లను సర్దుబాటు చేయడం మూలంగా పోస్టుల్లో మరింత కోత పడింది. అన్ని ఖాళీలు కలిపి దాదాపు 135 వరకు ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో బీఎడ్, డీఎడ్ చదివి టెట్ ఉత్తీర్ణులైన వేలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా డీఎస్సీ వేయలేదు. ఇప్పుడు డీఎస్సీ వస్తుందని తెలిసినా, నిరుద్యోగుల్లో నిరాశే కనిపిస్తోంది. ఏళ్లుగా వేలల్లో ఖర్చు చేస్తూ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఉన్న కొద్దిపాటి పోస్టులకు ప్రిపేరై ఒక్కో పోస్టుకు వందల్లో పోటీ పడే అవకాశాలున్నాయని అంటున్నారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు!

- రిపోర్ట్ చేసిన పదిమంది విద్యార్థులు
- కొనసాగుతున్న ప్రక్రియ



కామారెడ్డిలోని మెడికల్ కళాశాల భవనం

సాక్షి, కామారెడ్డి : నీట్ కౌన్సెలింగ్ ద్వారా కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు జాయినింగ్ రిపోర్టు చేస్తున్నారు. ఆల్ ఇండియా కోటాలో ఇప్పటికే నలుగురు విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు సీట్ల కోసం ఆప్షన్లు ఇవ్వగా ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు ఆరుగురు విద్యార్థులు రిపోర్ట్ చేశారు. దీంతో కాలేజీలో చేరిన విద్యార్థుల సంఖ్య పదికి చేరింది. కాలేజీలో వంద సీట్లకు గాను పది మది జాయిన్ అయ్యారు. ఇప్పటికే సీట్లు అలాట్ అయిన విద్యార్థులు నిర్ణీత సమయంలోపూ జాయిన్ కావాల్సి ఉంటుంది. రెండు మూడు రోజుల్లో వారంతా జాయిన్ అవుతారని తెలుస్తోంది. కామారెడ్డి కాలేజీలో సీటు పొందిన విద్యార్థులు ఒక్కొక్కరుగా వచ్చి జాయినింగ్ రిపోర్టు చేస్తున్నారు.

పలువురు స్థానిక విద్యార్థులు

జిల్లా కేంద్రంలో ఏర్పాటైన మెడికల్ కాలేజీలో స్థానిక విద్యార్థులు పలువురికి సీట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరు ఇప్పటికే జాయిన్ అవ్వగా, మిగితా వాళ్లు కూడా రేపు, ఎల్లుండి జాయిన్ అవుతారని తెలుస్తోంది. మన దగ్గరే మెడికల్ కాలేజీ ఉండడంతో చాలామంది విద్యార్థులు ఇక్కడ ఆప్షన్ ఇచ్చుకున్నారు. ర్యాంకు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. అందులో భాగంగా ఇప్పటికే కొందరు స్థానిక విద్యార్థులకు సీట్లు దక్కాయి. మెడికల్ కాలేజీ కావాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరుతోంది.

చురుకుగా కళాశాల నిర్మాణ పనులు

కాలేజీ అడ్మిషన్ల ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగా, నిర్మాణ పనులు కూడా నడుస్తున్నాయి. ముందు భాగంలో ప్లాస్టరింగ్, కలరింగ్ పూర్తి చేశారు. పైఅంతస్తుల నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

ప్రస్తుతం మాతా శిశు ఆస్పత్రి కోసం నిర్మించిన భవనాన్ని మెడికల్ కాలేజీకి వినియోగిస్తున్న విషయం తెలిసిందే. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగానే తరగతులు ప్రారంభించేందుకు వైద్య విద్యాధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే నిర్మాణ పనులు పూర్తికాకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. విద్యార్థులకు హాస్టల్ కోసం ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకున్నారు.

ధన్యవాదాలు



సీఎంను కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు

బాన్సువాడ/భిక్కనూరు : బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా బాన్సువాడ అసెంబ్లీ స్థానానికి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను స్పీకర్ కలిశారు. సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని స్పీకర్ అన్నారు. అలాగే మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు సీఎం కేసీఆర్‌ను కలిశారు. కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కుమారుడి పెళ్లికి రండి..



సీఎం కేసీఆర్ దంపతులకు పెళ్లిపత్రిక అందజేస్తున్న ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్ కుటుంబ సభ్యులు

సాక్షి, కామారెడ్డి : తన కుమారుడు శశాంక్ వివాహానికి రావాలని ఆహ్వానిస్తూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం సీఎం కేసీఆర్‌కు వివాహ పత్రిక అందజేశారు. గంప గోవర్ధన్‌తో పాటు ఆయన సోదరుడు ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ గోపాల్, వారి కుటుంబ సభ్యులందరూ ప్రగతి భవనకు వెళ్లి సీఎం కేసీఆర్, సతీమణి శోభకు వివాహ పత్రిక అందజేసి ఆహ్వానించారు. తప్పకుండా పెళ్లికి రావాలని కోరారు. తప్పనిసరిగా వివాహానికి వస్తామని సీఎం ఈ సందర్భంగా తెలిపినట్లు విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

గాంధీ చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన

కామారెడ్డి క్రైం : విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించేందుకు ప్రభుత్వం జిల్లాలోని 9 సినిమా హాళ్లలో ఉచితంగా ప్రదర్శించిన గాంధీ చిత్రానికి చక్కటి స్పందన లభించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. స్వతంత్ర వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 నుండి 24 వరకు కామారెడ్డి పట్టణంలోని 4 సినిమా హాళ్లలో, బాన్సువాడలోని 2 సినిమా హాళ్లు, పిట్లం, నాగిరెడ్డిపేట, బిచ్కుందలోని ఒక్కో సినిమాహాల్‌లో గాంధీ చిత్రాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 45,732మంది విద్యార్థులు చిత్రాన్ని చూశారన్నారు. గురువారం 47స్కూళ్లకు చెందిన 6,133 మంది చూశారన్నారు. చిత్ర ప్రదర్శనకు విద్యాశాఖ, రవాణా, రెవెన్యూ, పోలీస్‌శాఖ సమన్వయంతో కృషి చేశారన్నారు.

క్లుప్తంగా

క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే



నిజాంసాగర్: రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేసిన రాజేశ్వర్‌రావును జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పిట్లం, జుక్కల్, బిచ్కుంద మండలాల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఫరీద్‌పేటవాసికి ఫోక్‌స్టార్ అవార్డు



మాచారెడ్డి: కళారంగంలో రాణిస్తున్న పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన కర్రోళ్ల దేవాగౌడ్‌కు రాష్ట్రీయ ఫోక్‌స్టార్ అవార్డు లభించింది. జాతీయ జాన పద దినోత్సవం సందర్భంగా మదర్ ఇండియా వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. దేవాగౌడ్ తెలంగాణ ఉద్యమ పాటలతో పాటు జానపద గీతాలను ఆలపించి పలువురి మన్ననలు పొందారు.

మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన

తాడ్వాయి: తాడ్వాయిలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మానసిక సమస్యలు, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్ రమణ గురువారం అవగాహన కల్పించారు. సమయానికి నిద్ర పోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత కోసం వ్యాయామం, ఆటలు ఆడటం లాంటివి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రపహాడ్ పీహెచ్‌సీ వైద్యుడు అర్జుమన్ నజీరా, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సైకియాట్రిక్ సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సుధారాణి, జ్యోతి, అనూష, ఉమారాణి పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ వాహనాల సీజ్



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకొని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గురువారం తెలిపారు. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌చార్జి పర్వేజ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ అబ్దుల్ ముమీన్, జవాన్ దుర్గాప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

గిరిజన గురుకులంలో సమస్యలు

- మెనూ ప్రకారం అందని భోజనం
- ఇంగ్లిష్ ఉపాధ్యాయులు లేక విద్యార్థుల ఇబ్బందులు



నస్రుల్లాబాద్ గిరిజన బాలుర గురుకుల పాఠశాల

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో గల గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. బాన్సువాడ పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించి ఇచ్చారు. పాఠశాలలో ఇంగ్లిష్ బోధించడానికి శాశ్వత ఉపాధ్యాయులు ఉన్నా కూడా రెండేళ్లుగా సెలవులో వెళ్లారు. మరో ఉపాధ్యాయుడు సైతం సరిగ్గా పాఠశాలకు రాక పోవడంతో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు పాఠాలు ముందుకు సాగడం లేదు. అంతే కాకుండా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లిన నాటి నుంచి ఇష్టారీతిన పాఠశాల నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో 552 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం మెనూ రూపొందించింది. ఇందుకోసం టెండర్లు వేసి అవసరం అయిన వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేసినా కూడా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. వారంలో ప్రతి రోజు టిఫిన్‌కు బదులు అన్నం పెడుతున్నారు. ఇడ్లి, పూరి, బజ్జీ, పులిహోర, వెజిటేబుల్ బిర్యాని వంటివి పెట్టాల్సి ఉన్నా ప్రతి రోజు అన్నంతో కలిపిన ఆహారం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

మెనూ ప్రకారమే అందిస్తున్నాం

విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం పెడుతున్నాం. ఉపాధ్యాయులు సెలవులలో ఉన్న మాట వాస్తవం. భౌతిక శాస్త్రం, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాల నిర్వహణపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తాం. – సంపత్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- రెండు కిడ్నీలు ఫెయిలై ఆస్పత్రిపాలైన యువకుడు
- కిడ్నీ మార్పిడి చేయాలంటున్న వైద్యులు



చికిత్స పొందుతున్న రవి



అల్లం రవి

లింగంపేట: లింగంపేట మండలం జల్దిపల్లి గ్రామానికి చెందిన అల్లం రవి(25)కి రెండు కిడ్నీలు చెడిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అల్లం అంజయ్యకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు రవి ఉన్నారు. ఈ మధ్యనే పెద్ద కూతురు మృతి చెందింది. అంజయ్య దివ్యాంగుడు. అతని ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదు. తమను ఆదుకోవాల్సిన వయసులో కుమారుడు మంచాన పడడంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే అప్పు చేసి రూ.ఐదు లక్షలు వైద్యానికి ఖర్చు చేశారు. ప్రస్తుతం రవి స్నేహితుల ఆర్థిక సహకారంతో ఎల్లారెడ్డి ఆస్పత్రిలో వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయిస్తున్నారు. రెండు కిడ్నీలు ఫెయిల్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కిడ్నీలు మార్పిడి కో సం ఆపరేషన్ తప్పనిసరి అంటున్నారు. కిడ్నీల మార్పిడి కోసం దాతల ఆపన్న హస్తం అందించాల ని రవి తండ్రి కోరుతున్నాడు.

దాతలు సంప్రదించాల్సిన వివరాలు..

పేరు : అల్లం అంజయ్య
అకౌంట్ నంబర్ : 267410100030752
యూనియన్ బ్యాంకు, ఎల్లారెడ్డి బ్రాంచ్
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : యుబీఐఎన్0826740
ఫోన్ పే, గుగూల్ పే నంబర్: 9398397769 (అల్లం కిష్టవ్వ)

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు బీజేపీ సొంతం



రాజంపేటలో బీడీ కార్మికులతో మాట్లాడుతున్న సచిన్ కల్యాణ్ శెట్టి,



నర్సన్నపల్లి సమావేశంలో..

కామారెడ్డిరూరల్: క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు బీజేపీకి మాత్రమే సొంతం అని, అందుకే బీజేపీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం గల పార్టీగా ఎదిగిందని మహారాష్ట్రలోని అకల్‌కోట బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్‌శెట్టి అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా కామారెడ్డి, రాజంపేట మండలాల బూత్ అధ్యక్షులు, మండల కమిటీ సభ్యుల సమావేశం కామారెడ్డి మండలం నర్సన్నపల్లి రెడ్డి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం సచిన్ కల్యాణ్ శెట్టి మాట్లాడుతూ... బీజేపీ 300పై చిలుకు లోక్ సభ స్థానాలతో పాటు, 15 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తే కామారెడ్డిలో కాషాయ జెండా ఎగరవేయటం తథ్యమన్నారు. ఈ సందర్భంగా శాబ్దీపూర్, తలమడ్ల గ్రామానికి చెందిన యువకులు బీజేపీలో చేరారు. అనంతరం చిన్నమల్లారెడ్డిలోని పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు.

బీడీ కార్మికులతో మాటామంతి

రాజంపేట: రాజంపేటలోని బీడీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అకల్ కోట ఎమ్మెల్యే సచిన్ కళ్యాణ్ శెట్టి, బీజేపీ నాయకుడు వెంకటరమణారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు.

'కేసీఆర్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులు బుద్ధి చెప్పాలి'



జిల్లా కేంద్రంలో ఏఎన్‌ఎంల దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాజీ మంత్రితో విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రం వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ ఉండదని చెప్పి మోసం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్న ఏఎన్‌ఎంల దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రజలకు ఎన్నో సేవలను చేసిన ఏఎన్‌ఎంలను ప్రభుత్వం మర్చిపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రం వైద్యరంగంలో అగ్రగామిగా నిలవడంతో ఏఎన్‌ఎంల సేవలు కీలకమన్న మంత్రి హరీశ్‌రావు వారికి ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, సీనియర్ అడ్వకేట్ నరసింహారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరని సందీప్, చందు, రవిప్రసాద్ తదితరులున్నారు.

'కేసీఆర్‌ను చిత్తుగా ఓడిస్తాం'

కామారెడ్డి టౌన్: రాష్ట్రంతోపాటు జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కామారెడ్డిలో కేసీఆర్‌ను చిత్తుగా ఓడించేందుకు కృషి చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీని వారు కలిశారు. కేసీఆర్ విద్యారంగం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాకే కామారెడ్డిలో ఎన్నికల్లో పోటీకి రావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, మాజీ మంత్రి షబ్బీర్ అలీకే తమ మద్దతు ఉంటుందన్నారు. జిల్లాలో విద్యారంగ సమస్యలను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యా, వైద్య రంగాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని నాయకులకు షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. బీడీఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, బీవీఎం, టీజేఎస్, బీసీ విద్యార్థి, టీఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్, సందీప్, దశరథ్, అరుణ్, విఠల్, లక్ష్మణ్‌యాదవ్, బాలు, నాగరాజు, భరత్, రోషన్, సోఫియాన్, రాహుల్, ప్రవీణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

డబ్బులిప్పిస్తారా.. చావమంటారా..?

- పొదుపు డబ్బుల కోసం మహిళల దీక్ష
- పురుగు మందు డబ్బాలతో సీఏ ఇంటి ఎదుట బైఠాయింపు
- పోలీసులతో వాగ్వాదం



పురుగు మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న మహిళలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్సై రాజేశ్వర్

నిజాంసాగర్: బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి డబ్బుల కోసం దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గురువారం మండలంలోని హసన్‌పల్లిలో ఐకేపీ మహిళలు స్థానిక సీఏ ఇంటి వద్ద పురుగు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. పొదుపు డబ్బులు కాజేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నెలనెలా పొదుపు డబ్బులు బీసీ పాయింట్ సెంటర్‌లో చెల్లించినప్పటికీ తమ బ్యాంక్ ఖాతాల్లో జమచేయలేదన్నారు. గ్రామంలోని 11 స్వయం సంఘాలకు సంబంధించి రూ. 26 లక్షలు మింగేసిన బీసీపాయింట్ నిర్వాహకులు, ఐకేపీ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిప్పించకపోతే అక్కడే పురుగుల మందు తాగి చనిపోతామని వారు నిరసనకు దిగారు. నిజాంసాగర్ ఏఎస్సై రాజేశ్వర్ దీక్ష చేస్తున్న మహిళల వద్దకు వచ్చి నచ్చజెప్పినప్పటికీ వారు వినలేదు. సీఏ ఇంటి వద్ద కాదని మండల, జిల్లాధికారులకు ఫిర్యాదు చేయాలని ఏఎస్సై సూచించారు. అయినా మహిళలు వెనక్కి తగ్గలేదు. మూడురోజుల నుంచి టెంట్ వద్దే మహిళలు దీక్ష చేస్తున్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): టీయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. ఉదయం నిర్వహించిన పీజీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 1668 మంది విద్యార్థులకు 1566 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 39 మంది విద్యార్థులకు ఇద్దరు, బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్షకు 30 మంది విద్యార్థులకు ముగ్గురు, 3వ సెమిస్టర్ పరీక్షకు 39 మందికి నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు.

జీపీ భవనం కోసం రెండు గ్రామాల పంచాయితీ





సర్పంచ్ ఇంటి వద్ద ధర్నా చేస్తున్న మొండిసడక్ గ్రామస్తులు, జీపీ భవనం వద్ద నర్సాపూర్ గ్రామస్తులు

గాంధారి: మండలంలోని మొండి సడక్- నర్సాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని తమ ఊర్లో అంటే తమ ఊర్లో నిర్మించాలని మొండి సడక్, నర్సాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సర్పంచ్ స్వర్ణలత ఇంటి వద్ద మొండి సడక్ గ్రామస్తులు, మొండి సడక్ వద్ద అటవీ శాఖ విశ్రాంతి గదిలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద నర్సాపూర్ గ్రామస్తులు బైఠాయించి పోటా పోటీగ గురువారం ధర్నా చేశారు. గతంలో మొండి సడక్, నర్సాపూర్ గ్రామాలు ముదెల్లి పంచాయతీలో ఉండేవి. ప్రభుత్వం మొండి సడక్, నర్సాపూర్ గ్రామాలను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేసింది. జీపీ భవనం కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి. దీంతో రెండు గ్రామాల మధ్య పంచాయితీ ప్రారంభం అయింది. నూతన పంచాయతీ భవనాన్ని తమ గ్రామంలోనే నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు పట్టు పడుతున్నారు. ఎమ్మెల్యే సురేందర్ రెండు గ్రామాల పెద్దలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల ప్రాంతీయ సమన్వయాధికారిగా అలివేలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిజామా బాద్ ప్రాంతీయ సమన్వయాధికారి (ఆర్‌సీవో)గా అలివేలు గురువారం నియామకయ్యారు. ఇంతకు ముందు ఆర్‌సీవోగా ఉన్న మేరీ యేసు పాదం కరీంనగర్ రీజియన్‌కు బదిలీ అయ్యా రు. బాధ్యతలు స్వీకరించిన అలివేలు నిజామాబాద్ రీజియన్ పరిధిలోని గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ధర్మారం(బి) గురుకుల కళాశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రవేశాల ఫలితాలు, ఆహారం, పరిశుభ్రత పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఆర్‌సీవో మేరీ యేసుపాదంను సన్మానించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు శివరాం, సత్యనారాయణ, నలిని, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

'బీసీలకు అన్యాయం చేసిన బీఆర్‌ఎస్'



పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం టికెట్లను కేటాయించి బీఆర్‌ఎస్ అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్, పూలే విగ్రహాలకు వినతిపత్రాలను అందజేసి నిరసన తెలిపారు. తక్షణమే బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన సీట్ల జాబితాను సవరించాలని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్‌ను బర్తరఫ్ చేసిన మంత్రి స్థానాన్ని రెడ్డి వర్గానికి కేటాయించడం దారుణమన్నారు. బీఆర్‌ఎస్‌లో సామాజిక న్యాయం లేదన్నారు. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, మారోజు మోహనా చారి, హాజీ అబ్దుల్ అజీజ్, ఎండీ ఈదుల్ సాబ్, సిహెచ్. రాజయ్య, సాయాగౌడ్ పాల్గొన్నారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

మోపాల్: మండలంలోని అమ్రాద్‌తండాలో చెట్లు నరికివేస్తుండడంపై అటవీ అధికారులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై రాములు తండాకు చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వెంట సిబ్బంది, ఫారెస్టు అధికారులు ఉన్నారు.

క్రైం కార్నర్

పీడీఎస్ బియ్యం పట్టివేత



రామారెడ్డి: పోసానిపేట గ్రామంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న చిదుర ప్రకాశ్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని ఉప్పల్‌వాయి, పోసానిపేట గ్రామాల్లో కొందరు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై వెంట సివిల్ సప్లై డీటీ కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో మేకను దొంగలించిన ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మరుపల్లి ఎల్లయ్య తన పశువుల కొట్టం వద్ద తన మేకను ఉంచగా తాడ్వాయి మండలానికి చెందిన వేణు, అనిల్ బుధవారం రాత్రి సమయంలో బైకుపై పశువుల కొట్టంలో దొంగిలించారు. జిల్లా కేంద్రంలో విక్రయిస్తుండగా కొనుగోలు చేసిన వ్యక్తి అనుమానం వచ్చి వివరాలు సేకరించారు. దీంతో వారు దొంగిలించినట్లు ఒప్పుకోవడంతో స్థానికులు చితకబాదారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై గుండెల రాజు తెలిపారు. ఈ నెల 2న దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా కామారెడ్డికి చెందిన మామిండ్ల దేవేందర్, సదాశివనగర్ మండలం ధర్మరావుపేటకు చెందిన బుక సాధిక్‌లు మద్యం సేవించినట్లు ఎనలైజర్ ద్వారా గుర్తించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నూతన ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ గురువారం తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రెన్యువల్, నూతన ఉపకార వేతనాల కోసం డిసెంబర్ 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు http:// telanganaepass.cgg.gov.in ను సందర్శించాలన్నారు.

విదేశీ విద్యకు..

నిజామాబాద్‌అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి గురువారం తెలిపారు. 2023 విద్యా సంవత్సరానికి మైనార్టీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్ధిస్టు, పార్శీలు) సీఎం విదేశీ విద్యాపథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీలో 60 శాతం మార్కులు ఉండి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు అర్హులన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే విద్యార్థులు వసంత సీజన్ 2023 (జనవరి నుంచి జూలై) వరకు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 21 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడవుల సంరక్షణపై సదస్సు

ధర్పల్లి: అడవులను సంరక్షించాలని ఫారెస్ట్ అధికారులు అన్నారు. మండలంలోని నడిమి తండాలో కొట్టాలపల్లి, హొన్నాజీపేట్ ఫారెస్ట్ అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పోడు పట్టాలు వచ్చిన వారు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. అడవుల్లోని చెట్లను నరికితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చంద్రయాన్-3 విజయోత్సవాలు



కామారెడి నిజాంసాగర్ చౌరాస్తాలో సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు



చిన్నమల్లారెడ్డి చైతన్య విద్యానికేతన్‌లో చంద్రయాన్ -3 అక్షర రూపంలో విద్యార్థులు

కామారెడ్డి టౌన్: చంద్రయాన్-3 చంద్రుడిపై విజయవంతంగా ల్యాండింగ్ అయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో సంబురాలు జరిగాయి. ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులతో గురువారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తాలో విద్యార్థులు జాతీయ జెండాలతో నినాదాలు చేశారు.

కామారెడ్డిరూరల్: చిన్న మల్లారెడ్డిలోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3 అక్షర రూపంలో కూర్చొని ప్రదర్శన చేశారు. పాఠశాల సెక్రెటరీ కరస్పాండెంట్ తానోబా ఆనందరావు పాల్గొన్నారు.

భిక్కనూరు: చంద్రయాన్ -3 విజయవంతంగా జాబిల్లిని చేరడంతో భిక్కనూరులో చైతన్య విద్యానికేతన్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మొండివాగు, పెద్దవాగుల నుంచి ఇసుక తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మోర్తాడ్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక

మోర్తాడ్: మండల కేంద్రంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మొండివాగు, పెద్దవాగుల నుంచి దళారులు ఎలాంటి అనుమతులు లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు వీరికి అడ్డు చెప్పకపోవడంతో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు, ఆరు కాయలు అనే విధంగా కొనసాగుతోంది. ప్రతి రోజు నిజామాబాద్, ఆర్మూర్ కేంద్రాలకు తరలిస్తూ ఖాళీ ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు. ఇంతలా వీరి వ్యాపారం కొనసాగడానికి దళారులు అధికారులకు అందిస్తున్న ముడుపులే అని చెప్పొచ్చు. వీరి అక్రమ వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇకనైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :91332 14214 [H-788623]

BUSINESS OFFER
■Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

CHANGE OF NAME
■I, KOLLE RAJINI (Old Name) H.No. 8-02/1, Pachalanadukuda, Veklpoor, Nizamabad. Hence Changed my Name as KOLLE RAJANI (New Name) W/o. KOLLE BHOJANNA [Z-799571]

■I, KOLLE NARSAWA (Old Name) H.No. 8-02/1, Pachalanadukuda, Veklpoor, Nizamabad. Hence Changed my Name as KOLLE NARSU (New Name) W/o. KOLLE GANGARAM [Z-799572]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.